# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 314 | పేజీలు: 4 | వెల: 4/- | శుక్రవారం ● 24, మే 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


### ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌లో

## భారీ ఎన్‌కౌంటర్

**ఏడుకు చేరిన మృతుల సంఖ్య - భారీగా ఆయుధాలు స్వాధీనం**



హైదరాబాద్,మే23(నమస్తే ఉదయం): ఛత్తీస్‌గఢ్ అడవులు మరోసారి కాల్పులతో దద్దరిల్లాయి. మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లా, నారాయణ పూర్ జిల్లా సరిహద్ద ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు నక్సలైట్లు మరణించారు. భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంద్రావతి ఏరియా కమిటీ, నారాయణపూర్, దంతెవాడ, బస్తర్ జిల్లాలకు చెందిన డీఆర్జీ, బస్తర్ టైగర్స్‌తో పాటు ఎస్టీఎఫ్ బృందాలపై కాల్పులు జరగడంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. ఇప్పటికే ఏడుగురు నక్సల్స్ మరణించగా, 12 మంది నక్సలైట్లు గాయపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే ఛాన్స్ ఉంది.



### ఇదిగో పౌరసరఫరా శాఖలో

## అవినీతి..చర్చకు వస్తారా?

- బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్
- సమాధానం చెప్పే ధైర్యం లేక కేసులు పెడతారా?
- జలసౌధలో మీ అరాచకాలు బయటపెట్టమంటారా?
- ప్రజాప్రతినిధిగా అడుగుతున్నా.. భయపడేది లేదు

హైదరాబాద్, (నమస్తే ఉదయం): పౌరసరఫరా శాఖలో అవినీతిపై కాంగ్రెస్ నేతలకు బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో గురువా రం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌరసరఫరా శాఖలో జరిగి న అవినీతి, అక్రమాలపై మాటాడితే మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమాధానం చెప్పలేక మొహం చాటేశాడు. ప్రజా సమస్యలపై ప్రతిపక్ష నేతగా ప్రశ్నిస్తే పోలీ సులకు ఫిర్యాదు చేయించి నాపై కేసు పెట్టిస్తారా..ఇదేనా ప్రజాపాలన అని ధ్వజమెత్తారు. జరిగిన అవినీతిపై నేను పూర్తి వాస్తవాలతో చర్చకు సిద్ధంగా ఉన్నాను. చర్చకు వస్తారా అని సవాల్ విసిరారు. కాళేశ్వరంపై రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించిన ప్రభుత్వం, సివిల్ సప్లయ్ శాఖలో జరిగిన అక్రమాలపై కూడా విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

**సమాధానం చెప్పే ధైర్యం లేదా ఉత్తమ్**

మంత్రి ఉత్తమ్‌కు మాట్లాడేందుకు సమాధానం లేక అధికారులతో ప్రకటనలు ఇప్పిస్తున్నాడు. బాధ్యత గల ప్రజాప్రతినిధిగా అవి నీతిని బయటపెట్టాను. నా ఆరోపణలు, సందేహాలు ఎలా తీరుస్తారో చెప్పకుండా కేసులు పెట్టి మొహం చాటేస్తున్నారు. జగ్గారెడ్డికి ఆ శాఖపై ఏం అవగాహన ఉంటుంది. జనవరి 25న టెండర్ల కోసం కమిటీ వేశారు. గైడ్ లైన్స్ కూడా ప్రిపేర్ చేశారు. అదేరోజు గ్లోబల్ టెండర్లకు ప్రకటన ఇచ్చారు. ఒక్క రోజులోనే కమిటీ ఏర్పాటు, మీటింగ్స్, గైడ్‌లైన్స్ రూపకల్పన, అదేరోజు టెండర్లకు ప్రకటన ఎలా సాధ్యం. ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ కోసం మరో గైడ్‌లైన్స్ తయారు చేశారు. టెండర్లలో

మిగతా.. 2లో

### రాష్ట్ర వ్యాప్తంగా సజావుగా

## ధాన్యం కొనుగోళ్లు

- చిన్నచిన్న పొరపాట్లను పెద్దవిగా చూడరాదు
- 7,172 సెంటర్లలో 39.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్

హైదరాబాద్,మే23 (నమస్తే ఉదయం): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరుగుతున్నాయని పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ పేర్కొన్నారు. అయితే పెద్ద సంఖ్యలో కొనుగోళ్లు జరిగినప్పుడు చిన్న చిన్న లోపాలు జరగడం సహజమని ఆయన అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై చౌహాన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తి కావొస్తోందన్నారు.




ధాన్యం కొన్న తర్వాత రైతులకు డబ్బులు పడ్డాయా లేదా అనేది ప్రతీ సెంటర్ నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నాం. 7,172 సెంటర్‌లలో 39.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. తెలంగాణ బియ్యానికి మంచి బ్రాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కొనుగోలు కేంద్రాల వద్ద నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ధాన్యం తరుగు అనేది అవాస్తవం.. కొనుగోలు కేంద్రాల వద్ద క్లీనింగ్ మిషన్లు పెట్టాము. క్లీనింగ్ ఉన్న ధాన్యంలో ఒక్క కిలో కూడా కటింగ్ లేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే ధాన్యం క్లీన్‌గా ఉండాలని ఆదేశాలు ఉన్నాయి. ధాన్యంలో మట్టి, చిన్న రాళ్ళు, డస్ట్ ఉంటే సమస్య వస్తుంది. బకాయిలు ఉన్న మిల్లర్లకు ధాన్యం ఇవ్వలేదు. కొంతమంది మిల్లర్ల వద్ద కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయి. అందుకే వాళ్లకు ధాన్యం

మిగతా.. 2లో



## తెలంగాణలో బుద్ధ బిక్షులకు తగిన గౌరవం

- ఏ పని అయినా నేను ఎంతో ధ్యానంగా చేస్తా
- ఒక పాఠశాలను నిర్వహించాలని కోరుతున్న
- సికింద్రాబాద్‌లోని మహా బుద్ధ విహారలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, (నమస్తే ఉదయం): గొప్ప క్షేత్రాన్ని సందర్శించిన అనుభూతి కలిగింది. రాజ్యం, అధికారం ఉండి వాటిని కాదని, 29 ఏళ్ల వయసులో శాంతి కోసం బుద్ధుడు ఆలోచించారు. రెండున్నర వేల సంవత్సరాలుగా బౌద్ధ సిద్ధాంతం నిలబడి ఉంది. ప్రతి పనిని ధ్యానంగా చేయాలన్న సూచన లో చాలా అర్థం ఉంది. ఈ సూక్తిని నుంచి ఎంతో స్ఫూర్తిని పొందాను. ఏ పని అయినా నేను ఎంతో ధ్యానంగా చేస్తాను. ధ్యాన మందిరం కోసం స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేస్తాం. ఒక పాఠశాలను నిర్వహించాలని నేను కోరుతున్న. సమాజంలో అసహనం, అసూయ పెరిగిపోతున్నాయి. సమాజంలో స్పర్థలు, ఉద్వేగాలు పెరిగేలా వాతా వరణం నెలకొని ఉంది. బుద్ధుని సందేశం దేశానికి ఇప్పుడు ఎంతో అవసరం. బుద్ధుని సందేశాన్ని సమాజంలో ప్రతి ఒక్కరికి చేరవేయడానికి అవసరమైన సహాయం వ్యక్తి గా, ప్రభుత్వంగా చేస్తాం. ఈ ప్రభుత్వం మీది... అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయి. తెలంగాణలో బుద్ధ బిక్షులకు తగిన గౌరవం ఉంటుంది.

### బాండ్ పేపర్ రాసిచ్చి

## రైతులను మోసగిస్తారా?

- అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాల్సిందే
- లేకుంటే అసెంబ్లీ సమావేశాలను స్తంభింపజేస్తాం
- తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి
- జగిత్యాల పర్యటనలో మాజీ మంత్రి హరీశ్‌రావు

జగిత్యాల, (నమస్తే ఉదయం): జగిత్యాల జిల్లా కొడిమియల్ మండల్ పూడూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు గురువారం సందర్శిం చారు కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగా రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో వేచి చేస్తున్నామని, ధాన్యం తడిచి మొలకెత్తిందని వడ్లను కొనమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండని సన్న వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పడం తమను మోసం

మిగతా.. 2లో





## ధాన్యం కొనడానికి ఏం నొప్పి?

- కేంద్రం దొడ్డు బియ్యానికి సిద్ధంగా ఉన్నా స్పందించరా?
- చెయ్యి గుర్తుపై ఓటేసినందుకు భస్మాసుర హస్తమేనా?
- రాష్ట్రం ప్రభుత్వ వైఖరిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, (నమస్తే ఉదయం): రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం దొడ్డు బియ్యాన్ని కొనేందుకు సిద్ధంగా ఉన్నా...రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదంటూ ప్రశ్నించారు. ఆయన గురువారం ఉదయం బీబీనగర్ మండలం రాఘవాపూర్, రుద్రవెల్లి గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, వెయిటింగ్‌లో పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 45 రోజుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు కనీస వసతులు లేవు. ట్రాన్స్‌పోర్టు, బస్తాలు, హమాలి చార్జీలు ఇలా మొత్తం కేంద్రం రాష్ట్రానికి చెల్లిస్తుంది. రాష్ట్ర సర్కారు కొనుగోళ్ల కోసం ఒకవేళ బ్యాంకు నుంచి

మిగతా.. 2లో


ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం

**ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం**

నాగర్‌కర్నూల్ జిల్లా

**విత్తన మేళా**

స్థలం : ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం

తేది : 24-05-2024

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం నందు ఈ క్రింద తెలిపిన విత్తనాలు విక్రయానికి అందుబాటులో ఉన్నాయి.

| క్రమ సం. | పంట | రకం | ప్యాకింగ్ సైజ్ | ధర రూ॥ |
|---|---|---|---|---|
| 1. | వరి | RNR - 15048 (తెలంగాణ సోన) | 15 Kg | 750/- |
| 2. | వరి | KNM - 1638 (కూనారం వరి - 2) | 20 Kg | 960/- |
| 3. | కంది | PRG - 176 (ఉజ్వల) | 3 Kg | 450/- |
| 4. | ఉలవలు | పాలెం - 1 | 4 Kg | 440/- |
| 5. | మినుములు | MBG - 1070 | 6 Kg | 900/- |
| 6. | పెసర | MGG - 385 | 6 Kg | 840/- |
| 7. | ఆముదం | PCH - 111 | 2 Kg | 700/- |
| 8. | పచ్చజొన్న | PYPS - 2 (పాలెం పచ్చజొన్న - 1) | 3 Kg | 450/- |
| 9. | తెల్లజొన్న | CSV - 41 (తెలంగాణ జొన్న - 1) | 3 Kg | 270/- |
| 10. | రాగి | PRS - 38 (పాలెం రాగి - 38) | 2 Kg | 150/- |
| 11. | సజ్జ | PBH - 1625 (పాలెం సజ్జ - 1625) | 2 Kg | 200/- |
| 12. | కొర్ర | PKS - 22 | 2 Kg | 130/- |
| 13. | వేరుశనగ | TCGS - 1694 (విశిష్ట) | 30 Kg | 3,240/- |

మరిన్ని వివరాలకు క్రింద తెలిపిన ఫోన్ నంబర్లకు సంప్రదించగలరు.

వరి మరియు ఆముదం : 8885331799
జొన్న : 8978229445
కంది, మినుము, పెసర మరియు ఉలవలు : 6281121529
వేరుశనగ : 9705069580
చిరుధాన్యాలు : 8919409933

ఇట్లు
సహ పరిశోధన సంచాలకులు
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం

## బాండ్ పేపర్ రాసిచ్చి
# రైతులను మోసగిస్తారా?

**మొదటి పేజీ తరువాయి..**

చేయడమేనని గోడు చెప్పుకున్నారు. తమ పక్షాన అసెంబ్లీలో ప్రభు త్వాన్ని నిలదీయాలని కోరారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడు తూ అన్ని రకాల వడ్లకు 500 బోనస్ ఇవ్వాల్సిందేనని, లేకపోతే వచ్చే అసెంబ్లీ సమావేశాలను స్తంభింపజేస్తామని తెలిపారు.

### బాండ్ పేపర్ మీద రాసిచ్చి మోసం చేస్తారా

ఇక్కడే రమేష్, లక్ష్మారెడ్డి అనే రైతులు ఉన్నారు. నెల క్రితం ధాన్యం తెచ్చారు. రాత్రి వర్షంతో సంచులు తడిచిపోయాయి. చాలా మంది రైతులకు సంబంధిం చిన కుప్పల్లో ఇప్పటికే మొలకెత్తింది. ధాన్యం కొనుగోలు చేయక తీవ్ర నష్టం జరిగింది. చాలామంది రైతులు దాదాపు 100, 200 రూపాయలు తక్కువ ధరకు మధ్య దళారులకు అమ్ముకునే పరిస్థితి



వచ్చింది. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదు. ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి, సీఎల్పీ లీడర్‌గా భట్టి విక్రమార్క బాండ్ పేపర్ మీద వడ్లకు 500 బోనస్ ఇస్తామని రాసిచ్చి నేడు సన్నాలకు మాత్రమే ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కు తున్నారని మండిపడ్డారు. వ్యవసాయ అధికారులతో మాట్లాడితే రెండు లక్షల 97 వేల ఎకరాల్లో జగిత్యాల జిల్లాలో యాసంగిలో వారి పంట పండితే ఇందులో 2,80,000 ఎకరాల్లో దొడ్డు వడ్లు ఉంటే, 10 వేల ఎకరాల్లో మాత్రమే సన్నాలు వేశారన్నారు.

రైతులను అవమానించేందుకేనా గెలిపించింది

లక్ష్మారెడ్డి అనే రైతు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ మంత్రి అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని కొంతమంది మొరుగుతున్నారని అంటున్నారని, ఇచ్చిన హామీ అమలు చేయమంటే రైతులను కుక్కలు అంటున్నారా అని ఆవేదన వ్యక్తం చేశాడు. రైతుబంధు అడిగితే రైతులను చెప్పుతో కొట్టాలని ఒక మంత్రి అంటు న్నాడు. రైతులను అవమానించేందుకేనా మిమ్మల్ని గెలిపించిందని ప్రశ్నించారు. ప్రభుత్వం, మంత్రులు మేల్కొని హైదరాబాద్‌లో కూర్చోకుండా క్షేత్రస్థాయిలో వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించి తడిసిన మొలకెత్తిన వడ్లను కొని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఇదిగో పౌరసరఫరా శాఖలో
# అవినీతి..చర్చకు వస్తారా?

**మొదటి పేజీ తరువాయి..**

పాల్గొనేం దుకు పంజాబ్, హర్యానా నుంచి కాంట్రాక్టర్లు ముందుకు వస్తే కొందరు అధికారులు వారిని బెదిరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే ఏప్రిల్ 18న హైదరాబాద్‌లోని జలసౌధలో రైస్ మిల్లర్లతో సమావేశంలో ఒప్పందాలు చేసుకున్నారు.

### మీ అరాచకాలను బయటపెట్టమంటారా?

రూ.216 అదనంగా మిల్లర్ల నుంచి వసూలు చేసింది నిజం కాదా? స్థాయికి మించి అదనపు ధాన్యం మిల్లర్లకు ఇస్తే వారు ఎలా భరిస్తారు. మిల్లర్లు బియ్యం ఇస్తామంటే డబ్బులే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిల్లర్లతో మీరు బెదిరింపులకు పాల్పడిరది నిజం కాదా? అని ప్రశ్నించారు. జలసౌధాలో మీరు చేసిన అరాచ కాలు బయటపెట్టాలా? ప్రజల కోసం ఎన్ని అవాంతరాలు ఎదురైనా భయపడేది లేదు.

### కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదు

మే 23 లోపు పూర్తి మెటీరియల్ లిఫ్ట్ చేయాలని టెండర్‌లో కోరారు. పూర్తిధాన్యం లిఫ్ట్ చేయకపోతే బ్లాక్ లిస్టులో పెడతామని చెప్పారు. ధాన్యం కొనుగోలులో రూ.800 కోట్ల అవినీతి జరి గింది. నేటితో కాంట్రాక్టర్‌కు ఇచ్చిన గడువు కూడా ముగిసింది. అయినా కాంట్రాక్టర్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు. మే 23తో గడువు ముగిసి, పూర్తి ధాన్యం కొనుగోలు చేయని బిడ్డర్లకు ఎందుకు ఎక్స్‌టెన్షన్ ఇస్తున్నారు. రూ.2259లకు లక్షా 59 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అమ్మేశారు. మధ్యాహ్న భోజనం, హాస్ట ళ్లలో విద్యార్థుల కోసం అంటూ మళ్లీ ఎందుకు కొంటున్నారు? క్వింటాకు రూ.5700లకు తిరిగి సన్నబియ్యం ఎందు కు కొన్నారు? 22 లక్షల క్వింటాళ్ల బియ్యం కొనుగోలు చేశారు. 10 శాతం నూక ఉన్న బియ్యం ఓపెన్ మార్కెట్‌లో రూ.38 రూపా యలకే దొరుకుతుంది. ఇంత వ్యత్యాసంతో ఎందుకు అమ్మారు? ఇప్పుడు ఎందుకు మళ్లీ అధిక ధరకు కొంటున్నారు? సివిల్ సప్లయ్ శాఖలో ఇలా జరిగిన ఎన్నో అవినీతి, అక్ర మాల పై మా దగ్గర ఆధారాలు ఉన్నాయి. మంత్రిగారు చర్చకు వస్తే నిరూపించ డానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు.

## రాష్ట్ర వ్యాప్తంగా సజావుగా ధాన్యం కొనుగోళ్లు

**మొదటి పేజీ తరువాయి..**

ఇవ్వలేదు. నీతినిజాయితీగా పని చేస్తున్నాం. మిల్లర్ల వద్ద డబ్బులు అధికారులు డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు చేయడం సరికాదు. ఆధారాలుంటే నిరూపించాలన్నారు. మాపై అసత్య ఆరోపణలు చేయడం వల్ల మాకే కాదు రైతులకు కూడా ఇబ్బంది అవుతుంది. ఆధారాలు లేని అవాస్తవాలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని చౌహాన్ హెచ్చరించారు.

## ఆర్టీసీ కొత్త లోగోను విడుదల చేయలేదు

### సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం అబద్ధం: సజ్జన్నార్

హైదరాబాద్,మే23(నమస్తే ఉదయం): తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు టీఎస్ఆర్టీసీ పేరును టీజీఎస్ఆర్టీసీగా మార్చింది. అయితే, టీజీఎస్ఆర్టీసీ లోగో ఇదేనంటూ సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పందించారు. కొత్త లోగో విషయంలో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. అధికారికంగా ఇప్పటివరకు కొత్త లోగోను సంస్థ విడుదల చేయలేదన్నారు. టీజీఎస్ఆర్టీసీ కొత్త లోగో అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న లోగో ఫేక్ అంటూ క్లారిటీ ఇచ్చారు. ఆ లోగోతో సంస్థకు ఎలాంటి సంబంధం లేదని.. కొత్త లోగోను సంస్థ రూపొందిస్తుందని ఆయన తెలిపారు. కొత్త లోగోను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఇంకా ÷నైల్ చేయలేదన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు టీఎస్ ఆర్టీసీ పేరును టీజీఎస్ఆర్టీసీగా మారుస్తూ మంగళవారం ఆర్టీసీ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు టీఎస్ఆర్టీసీ పేరును టీజీఎస్ఆర్టీసీగా మార్చామని సజ్జనార్ పేర్కొన్నారు. సలహాలు, సూచనలతో పాటు ఫిర్యాదులను కొత్త సోషల్ మీడియా ఖాతాలో ఇవ్వాలని సూచించారు.

## ధాన్యం కొనడానికి ఏం నొప్పి?

**మొదటి పేజీ తరువాయి..**

అప్పు తీసుకుంటే దాని వడ్డీ కూడా కేంద్రమే చెల్లిస్తుంది. రైతుల ధాన్యం కొనడంలో రాష్ట్ర సర్కారుకు ఏం నొప్పి అని నేను అడుగుతున్నాను. ధాన్యం ఎండకు ఎండుతూ.. వానకు నానుతూ ధాన్యం మొలకలొస్తుంటే ఈ ముఖ్యమంత్రికి ఏ మాత్రం సిగ్గనిపిస్తలేదా? అని ప్రశ్నించారు. నాడు వరి వేస్తే ఉరి అని కేసీఆర్? అంటే.. ఇప్పుడు దొడ్డు వడ్లు వేస్తే ఉరి అని రేవంత్ అంటున్నాడు. చెయ్యి గుర్తుకు ఓటు వేసినందుకు రైతుల మీద కాంగ్రెస్ ప్రభుత్వం భస్మాసుర హస్తం పెడుతుంది.

ఈ ప్రభుత్వం సన్నరకం వడ్ల సాగును ప్రోత్సహించాలనుకుంటే వాటికి రూ.1000 బోనస్ ఇవ్వండి, దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి. ఆరు గ్యారంటీల అమలును పక్కన పడేసి సీఎం రేవంత్, మంత్రులు ఢల్లీ టూర్లు, ఎన్నికల ప్రచారానికి వెళుతున్నారు. ఇక్కడి సంపదను కొల్లగొడుతూ ఢల్లీ పార్టీకి సూట్ కేసులు మోస్తున్నారు. బీజేపీ కిసాన్ మోర్చా ప్రతినిధులు అంతా కొనుగో లు కేంద్రాలకు వెళ్లి రైతులకు అండగా నిలబడాలని కోరారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కొనుగోళ్లు పూర్తి చేయాలని, సీజన్‌కు ముందే పంట పెట్టుబడి సాయం అందించాలని కోరారు. లేదంటే ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై త్వరలోనే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

## రోడ్ల గుంతలపై మహిళ వినూత్న
# నిరసన

హైదరాబాద్,మే23 (నమస్తే ఉదయం): హైదరాబాద్ నగరానికి చెందిన ఓ మహిళ వినూత్న నిరసన తెలిపారు. హైదరాబాద్ రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయని, వరద నీరు దాంట్లోనే ఉండిపోవడంతో అటు వాహన దారులకు, ఇటు పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె నడిరోడ్డుపై వరద నీటిలోనే కూర్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. నాగోల్ – బండ్లగూడ రహదారిలోని ఆనంద్ నగర్ వద్ద రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని ఆమె పేర్కొన్నారు. వర్షపు నీరు గుంతల్లోనే ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుం దన్నారు. కొత్త రోడ్డు వేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఆమెకు ట్రాఫిక్ పోలీసులు నచ్చజెప్పినా కూడా అలానే వరద నీటిలో కూర్చుండి పోయారు. రోడ్డు వేస్తామని జీహెచ్ఎంసీ అధికారుల నుంచి స్పష్టమైన హామీ ఇస్తేనే నిరసన విరమిస్తానని ఆమె భీష్మించారు.




# వనపర్తి జిల్లా బీఆర్ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి దారుణహత్య

### కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

వనపర్తి,మే23 (నమస్తే ఉదయం): వనపర్తి జిల్లాలో బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి (45) దారుణహత్యకు గురయ్యారు. కొల్లాపూర్ నియోజకవర్గం చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో గత అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. రాత్రిపూట ఆరుబయట నిద్రిస్తున్న ఆయనను గుర్తుతెలియని వ్యక్తులు గొడ్డలితో తల నరికి చంపేశారు.బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీధర్ రెడ్డి (45) కుటుంబాన్ని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పరామర్శించారు. తన అనుచరుడు బొడ్డు శ్రీధర్ రెడ్డి భౌతికకాయాన్ని చూసి హర్షవర్ధన్ రెడ్డి కంటతడి పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ కక్ష్యతోనే శ్రీధర్‌రెడ్డిని హత్య చేశారని ఆయన ఆరోపించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయన్నారు. ఇటీవల బీఆర్ఎస్ మద్దతుదారులపై వరుసగా దాడులు జరుగుతున్నాయని హర్షవర్ధన్‌రెడ్డి చెప్పారు. దీనిపై డీజీపీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కాగా





కొల్లాపూర్ నియోజకవర్గం చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో గత అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. రాత్రిపూట ఆరుబయట నిద్రిస్తున్న ఆయనను గుర్తుతెలియని వ్యక్తులు గొడ్డలితో తలనరికి చంపేశారు.

ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం



ఉదయం కొల్లాపూర్‌కు బయలుదేరారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీధర్ రెడ్డి హత్యకు గురైన నేపథ్యంలో వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామంలో శ్రీధర్ రెడ్డి కుటుంబ సభ్యులను కేటీఆర్ పరామర్శించనున్నారు. కేటీఆర్ వెంట శ్రీనివాస్ గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, గువ్వల బాలరాజు, మన్నె క్రిశాంక్, పలువురు నేతలు ఉన్నారు.

# శ్రీధర్ రెడ్డి ముమ్మాటికీ రాజకీయ హత్యే

### మండిపడ్డ మాజీ ఐపిఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

వనపర్తి,మే23 (నమస్తే ఉదయం): సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు అండతో కాంగ్రెస్ నాయకులు రెచ్చిపోతున్నారని.. బిఆర్ఎస్ నేత, నాగర్‌కర్నూలు ఎంపి అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మెచ్చరించారు. దాడులకు బెదిరేది లేదని.. మాఫియాలను రాజ్యాంగబద్ధంగా కుప్పకూల్చే దాకా నిద్రపోనివ్వం ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. వనపర్తి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి గురువారం హత్యకు గురయ్యారు. హత్యాకాండపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. సీఎం, మంత్రి అండతో బీఆర్ఎస్ నాయకులపై పట్టపగలే దాడులు జరుగుతున్నాయని.. ప్రాణాలకు పెను ప్రమాదం పొంచి ఉందని డీజీపీకి ఫిర్యాదు చేసిన పది రోజుల్లోనే శ్రీధర్ రెడ్డి హత్యకు గురయ్యారని ఆయన అన్నారు. ఇది ముమ్మాటికి రాజకీయ హత్యేనని.. తెలంగాణలో ప్రతిపక్షమే ఉండకూడదని పక్కా ప్లాన్ ప్రకారమే కాంగ్రెస్ ప్రభుత్వం హత్యల సంస్కృతికి తెరలేపిందని మండిపడ్డారు.

ఇది ప్రజా పాలన కాదని.. ప్రతీకార పాలన అంటూ మండిపడ్డారు. మంత్రి అండదండలతో యథేచ్ఛగా జరుగుతున్న దాడుల్లో అధికార పార్టీ నిందితులను వెంటనే అరెస్ట్ చేసి వారిని పీడీ యాక్ట్ లాంటి చట్టాలను ప్రయోగించి జైల్లో పెట్టకపోవడంతోనే ఇలాంటి వరుస హత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. నిందితులతో కుమ్మక్కైతున్న కొందరు స్థానిక పోలీసు అధికారులను, ఎంతటి వారైనా సరే, వారిపై డిపాటంమెంటల్ ఎంక్వైరీ చేసి తప్పకుండా శిక్షించడంతో పాటు బదిలీ చేయాలన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావును మంత్రి వర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని.. కొల్లాపూర్, నాగర్ కర్నూల్ , అచ్చంపేట నియోజవర్గాల్లోని సమస్యాత్మక గ్రామాల్లో వెంటనే కేంద్ర బలగాలు, స్పెషల్ పోలీసు బలగాలతో పికెట్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాణాలకు ముప్పున్న బీఆర్ఎస్, ఇతర ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులకు వెంటనే రక్షణ కల్పించాలన్నారు.

రాష్ట్రంలో అడుగంటిన శాంతిభద్రతలకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి, హోంమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## బిజెపి ఎంపి జయంత్ సిన్హాకు నోటీసులు

### ఎన్నికల ప్రచారంలో పాల్గొనకపోవడంపై ఆక్షేపణ

రాంచీ,మే23 (నమస్తే ఉదయం): ఎన్నికల ప్రచారంలో ఎందుకు పాల్గొన లేదంటూ పార్టీ ఇచ్చిన షోక్ నోటీసుపై బీజేపీ సీనియర్ నేత, హజారీబాగ్ ఎంపీ జయంత్ సిన్హా స్పందించారు. షోకాజ్ నోటీసు చూసి ఆశ్చర్య పోయానన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఎందుకు ఓటు వేయలేదని, ఎన్నికల ప్రచారంలో ఎందుకు పాల్గొనలేదో వివరణ అడుగుతూ బీజేపీ జార్ఖండ్ ప్రధాన కార్యదర్శి ఆదిత్య సాహు షోకాజ్ నోటీసు జారీ చేశారన్నారు. వ్యక్తిగత కారణాత రీత్యా తాను విదేశాల్లో ఉండటంతో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు ఉపయోగించుకున్నట్లు ఆయన తన సమాధానంలో పేర్కొన్నారు. షోకాజ్ నోటీసుపై రెండు పేజీల వివరణతో కూడిన లేఖను జయంత్ సిన్హా అందజేశారు. షోకాజ్ నోటీసు చూడగానే తాను షాకయ్యానని.. ఆ లేఖ మీడియాలో ప్రత్యక్ష మవ్వడంతో మరింత ఆశ్చర్యానికి గురయ్యానని సిన్హా తెలిపారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయబోనని తాను ఈ ఏడాది మార్చి2న ప్రకటిం చిన విషయాన్ని లేఖలో పొందుపర్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాతో మాట్లాడిన తర్వాత ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణ యించుకున్నట్లు తెలిపారు. హజారీబాగ్ అభ్యర్థిగా పార్టీ మనీష్ జైస్వాల్‌ను ప్రకటించిందని, మార్చి8న ఆయనకు తాను అభినందనలు తెలిపడం ద్వారా ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపానన్నారు. తాను ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని పార్టీ భావించి ఉంటే తనను సంప్రదించి ఉండేవారని.. జార్ఖండ్‌కు చెందిన పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే లేదా పార్టీ ముఖ్య నాయకులు ఎవరూ తనను సంప్రదించలేదని సిన్హా లఏఖలో తెలిపారు. పార్టీ బహిరంగ సభలు లేదా సంస్థాగత సమావేశాలకు తనను పిలవలేద న్నారు. లోక్‌సభ స్పీకర్‌కు సమాచారం ఇచ్చిన తర్వాత వ్యక్తిగత పనుల కారణంగా మే10వ తేదీన విదేశాలకు వెళ్లానని జయంత్ సిన్హా స్పష్టం చేశారు. పార్టీ తనను ఎలాంటి కార్యక్రమాలకు పిలవక పోవడంతో తన అవసరం లేదనిపించిందన్నారు. విదేశాలకు వెళ్లే ముందు తాను పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలి పారు. తాను ఓటు వేయలేదని ఆరోపించడం సరికాదన్నారు.

పార్టీలో తన బాధ్యతలను ఎంతో నిబద్ధతతో, నిజాయితీతో నిర్వర్తించానని.. అలాగే తన పనితీరుకు ఎన్నోసార్లు ప్రశంసలు లభించిన విషయాన్ని లేఖలో సిన్హా గుర్తుచేశారు. తనకు పార్టీ అందించిన షోకాజ్ నోటీసుపై మీడియాలో ప్రచారం కావడం నిరాశపర్చిందన్నారు. ఈ లేఖను బహిరంగ పర్చడం తన దృష్టిలో సరికాదన్నారు. ఇటువంటి వైఖరి అంకితభావంతో పనిచేసే పార్టీ కార్యకర్తలను నిరాశపరచడమే అవుతుందన్నారు. పార్టీ కోసం విధేయతతో పనిచేసే తనను కావాలని టార్గెట్ చేసినట్లు కనిపిస్తోందని సిన్హా తన వివరణలో పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను
# గెలిపించాలి

### మరిపెడ సన్నాహక సభలో మంత్రి తుమ్మల పిలుపు

మహబూబాబాద్,మే23(నమస్తే ఉదయం): ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మేధావులు, గ్రాడ్యుయేట్లు మల్లన్నకు అత్యధిక మెజార్టీ ఇవ్వాలని అన్నారు. మల్లన్నను సోనియా, ఖర్గే ఎంపిక చేశారని.. తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మంత్రి మాట్లాడారు. పోరాటం చేసే సత్తా కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఉందని నిరూపిద్దాం. అభ్యర్థి ఎవరైనా సరే పార్టీ ఆదేశాలను అమలు చేసే కార్యకర్తలు, నాయకులు ఉండటం కాంగ్రెస్ పార్టీ అదృష్టం. అధికార పార్టీ బెదిరింపులకు, కేసులకు భయపడకుండా ఒంటరి పోరాటం చేసిన వ్యక్తి మల్లన్న. మూడు జిల్లాల్లో ఉన్న ఎంఎల్ఏ లు మెజారిటీ ఇస్తాం అంటున్నారు.. మన డోర్నకల్ నియోజకవర్గం ఎక్కువ ఇవ్వాలన్నారు. మీరిచ్చిన మనో ధైర్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కోసం మా వంతు కృషి చేస్తాం అని మంత్రి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు మా రైతుల మనో ధైర్యం దెబ్బతీసే విధంగా మాట్లతున్నారని మంత్రి నాగేశ్వరరావు అన్నారు. అయినా సరే మొలకలు వచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించాం. గతంలో 45 రోజుల్లో రైతులకు డబ్బులేశారు. మేము 4 రోజుల్లో వేస్తున్నాం. సన్న వడ్లకు బోనస్ ఇచ్చాం. దొడ్డు వడ్లు కు కూడా బోనస్ ఇస్తామని తెలియచేస్తున్న. మల్లన్నకు మద్దతు ఇవ్వాలని పేర్కొన్నారు. మీరు ఎప్పటి లాగే గత ప్రభుత్వంను నిలదీసిట్లే తప్పు చేసిన ప్రభుత్వాన్ని నిలదీయాలని మల్లన్నను మంత్రి తుమ్మల కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే రామచందర్ నాయక్, ఎమ్మెల్సి అభ్యర్థి తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు.

## నేడు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విత్తన మేళా

హైదరాబాద్,మే23(నమస్తే ఉదయం): వానాకాలం సీజన్ సందర్భంగా రైతులను నకిలీ విత్తనాలపై అప్రమత్తం చేసి, మేలైన వంగడాలు అందించాలని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. ఇందుకోసం ఈ నెల 24న రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో, జగిత్యాల, పాలెం, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు, 16 కృషి విజ్ఞాన కేంద్రా(కేవీకే)ల్లో విత్తన మేళాలను నిర్వహించనుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో మేళా శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. వ్యవసాయ పరిశోధనా మండలి సంస్థలు ఐఐఎంఆర్, ఐఐఓఆర్, ఐఐఆర్ఆర్‌లతోపాటు వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య శాఖలు ఇందులో పాల్గొననున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా జరిగే విత్తనమేళాల్లో 16 పంటల్లో 67 రకాలకు సంబంధించి దాదాపు 12 వేల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు విక్రయించేందుకు అందుబాటులో ఉంచనున్నారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతపై రైతుల సందేహాలు తీర్చటానికి ఆయా పంటల ప్రధాన శాస్త్రవేత్తలతో చర్చాగోష్ఠి ఏర్పాటు చేస్తున్నారు.

## కెయూ హాస్టళ్ల మూసివేత ప్రకటనపై నిరసన

హనుమకొండ,మే23 (నమస్తే ఉదయం): కాకతీయ విశ్వవిద్యాలయంలో మెస్‌లను మూసివేస్తామని హాస్టల్ డైరెక్టర్ సర్క్యులర్ జారీ చేయడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట వంట సామగ్రితో ఆందోళన చేపట్టారు. ప్లేట్లతో రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ పీడీఎస్‌యూ కార్యదర్శి మర్రి మహేశ్ మాట్లాడారు.రాష్ట్రంలో త్వరలో జరగబోయే గ్రూప్స్, డీఎస్సీతోపాటు వివిధ రకాల పరీక్షలు ఉన్నాయని, ఈ సమయంలో మెస్‌ను మూసివేయడం తగదన్నారు. సర్క్యులర్‌ను వెంటనే వెనకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హాస్టళ్ల డైరెక్టర్ సమ్మయ్య హాస్టల్స్‌ను మూసివేయమని, యథావిధిగా నడిపిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. విద్యార్థి నాయకులు వినయ్, రాజు, శ్రవణ్, అర్జున్, గణేశ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలో సత్తా చాటిన హైదర్గూడకు చెందిన గంగిడి పుల్లారెడ్డి

**రాజేంద్రనగర్,మే 23(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ కు చెందిన గంగిడి పుల్లారెడ్డి సికింద్రాబాద్ లో జరిగిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచారు.
సికింద్రాబాద్‌లో మున్సిపల్ (వీవీ గురుమూర్తి మెమోరియల్)లో గురువారం పాన్ ఇండియా గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ బస్తీకి చెందిన గంగిడి పుల్లారెడ్డి 52 వయసులో 400 మీటర్ల పథకం స్విమ్మింగ్ ఈవెంట్‌లో మొదటి స్థానంలో నిలిచి సత్తా చాటారు.స్విమ్మింగ్ ఫ్రీ స్టైల్ 200 మీటర్లు పోటీలో రెండవ స్థానంలో నిలవగా,బటర్ ఫ్లై పోటీలతో మూడవ స్థానం దక్కించుకున్నాడు.పోటీలు ముగిసిన అనంతరం విజేతగా నిలిచిన గంగిడి పుల్లారెడ్డికి పాన్ ఇండియా గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు ఆబహుమతి,మెడల్స్ అందజేశారు. పుల్లారెడ్డి స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ కనపరిచిన సందర్భంగా స్థానిక నాయకులు, అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు.



పుల్లారెడ్డికి సర్టిఫికెట్ ప్రధానం చేస్తున్న నిర్వాహకులు

## నకిలీ విత్తనాలతో రైతులకు నష్టం జరిగితే సహించేది లేదు

**- వనపర్తి జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి**

**నకిలీ విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై అధికారులు పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలి**

**రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవు**

**కొత్తకోట, మే 23(నమస్తే ఉదయం):**
ఉమ్మడి పాలమూరు జిల్లాలో వచ్చే వానకాలం సాగు చేసే రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టప్రకారంగా అధికారులు పీడీ యాక్ట్ అమలు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వనపర్తి జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాసరెడ్డి కోరారు. గురువారం ఆయన ఓ



ప్రకటనలో మార్కెట్లోకి నకిలీ విత్తనాలు నకిలీ పురుగు మందులు రాకుండా వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను కోరారు. నకిలీ విత్తనాలు విక్రయించేవారు , నకిలీ రసీదులు ఇచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విత్తనాలు ప్యాకెట్లలో కాకుండా లూసుగా దొరికే విత్తనాలను రైతులు కొనుగోలు చేయవద్దని ఆయన రైతులకు సూచించారు. విత్తనాలు అధికారికంగా గుర్తింపు పొందిన కంపెనీలను కొనుగోలు చేయాలన్నారు. రైతులు పంట చేతికందే వరకూ రసీదులు భద్రంగా పెట్టుకోవాలని ప్రభుత్వం నిషేధించిన బీటీ -3 పత్తి విత్తనాలను ఎట్టి పరిస్థితులలో డీలర్లు విక్రయించవద్దని, రైతులు కొనుగోలు చేయవద్దన్నారు.
రైతులు కష్టపడి వ్యవసాయం చేస్తారని వారిని ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఎరువుల డీలర్లు విత్తనాలు, ఎరువులు వివరాలు ధరలను బోర్డుపై తప్పనిసరిగా పంచే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. నిషేధిత నకిలీ పత్తి విత్తనాలను అమాయక రైతులకు విక్రయిస్తున్నారని అలాంటి ముఠాలపై చర్యలు తీసుకోని నకిలీ విత్తనాల అమ్మి రైతులను మోసగిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించకుండ డీలర్లు విక్రయించాలని ఆయన కోరారు.

## నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

**హైదరాబాద్, మే 23(నమస్తే ఉదయం) :**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెం టరీ పరీక్షలు శుక్రవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తారు. వార్షిక పరీక్షల్లోనూ విద్యా ర్థులకు ఇదే వెసులుబాటు కల్పించారు. శుక్రవారం నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్షలు ఉదయం 9:05 గంటలు, మధ్యాహ్నం 2 : 25గంటల వరకు వచ్చేవారిని పరీక్ష రాసేందుకు అనుమతి స్తారు. ఆ తర్వాత వచ్చేవారిని అస్సలు అనుమతించరు.
జూన్ 3 వరకు జరిగే ఈ పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యా హ్నం 12 గంటల వరకు ఫస్టియర్ విద్యార్థులకు, మధ్యాహ్నం 2 : 30 గంటల నుంచి సాయంత్రం 5 : 30





గంటల వరకు సెకండియర్ విద్యార్థులకు నిర్వహిస్తారు. మొత్తం 4.6 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయ నున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 900 పరీక్షాకేంద్రాలను ఇంటర్‌బోర్డు ఏర్పాటు చేసింది. విద్యార్థులు https://tsbie.cgg.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.




## మామిడికాయ పచ్చడి చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా రెడ్డి

**సిటీ బ్యూరో, మే 23 (నమస్తే ఉదయం):**
సోదరి,మనువడు ఇంద్రతో కలిసి శ్రీనగర్ కాలనీలోని ఇంట్లో ఆవకాయ పచ్చడిని మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తయారు చేశారు. ప్రతి ఏడాది స్వహస్తలతో పచ్చడి తయారు చేసే ఆనవాయితీని సబితమ్మ కొనసాగిస్తున్నారు. గత ఏడాది మంత్రిగా ఉన్నప్పుడు కూడ పచ్చడి సబితా ఇంద్రారెడ్డి సిద్ధం చేశారు. అమ్మ మామిడి కాయ పచ్చడి తయారు చేసిన అంశాన్ని కుమారులు,యువనేత కార్తీక్ రెడ్డి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.


మామిడికాయ పచ్చడి చేస్తున్న సబితమ్మతో మనుమడు ఇంద్రారెడ్డి

## నేడు రాజేంద్రనగర్, శంషాబాద్, హిమాయత్ సాగర్, నార్సింగి ప్రాంతాలలో

# విద్యుత్ లేని ప్రాంతాలు

**రాజేంద్రనగర్, మే 23(నమస్తే ఉదయం)బీ**
రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని ఉప్పరపల్లి ఫోర్టు వ్యూ కాలనీలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శుక్రవారం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఫోర్ట్ వ్యూ కాలనీ, పరమారెడ్డి హిల్స్ హ్యాపీ హెూమ్స్ కాలనీ అశోక్ విహార్ జనచైతన్య కాలనీ ప్రాంతాలు, హైదర్గూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు వెంకటేశ్వర కాలనీ ఎర్రబోడ ఉప్పరపల్లి హైదర్గూడా ప్రకాష్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హాథిరాం తెలిపారు.

**శివరాంపల్లి సెక్షన్‌లో...**

శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని భవాని కాలనీ ప్రావిడెంట్ అపార్ట్మెంట్ ఆవరణలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలలో చెట్ల కొమ్మలను తొలగించడానికి ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు ఆదర్శ నగర్ , మంజుభార్, ఆరంగర్ పిస్తా హౌస్, కింగ్స్ శరణ్య, లక్ష్మీనారాయణ విల్లాస్, మెట్రో కన్వెన్షన్ ప్రాంతాలు, డ్రీమ్ వ్యాలీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుండి రెండున్నర గంటల వరకు నైజర్ ఫంక్షన్ హాల్, ఆరంగర్ పోలీస్ స్టేషన్ గల్లి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హరినాథ చారి తెలిపారు.

**నేడు శంషాబాద్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం**

శంషాబాద్ సబ్ స్టేషన్ పరిధిలోని చిన్న గోల్కొండ విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు చిన్న గోల్కొండ బహదూర్ గూడ రషీద్ గూడ రాయికుంట సంఘీ కూడా హమీదుల్ల నగర్ ప్రాంతాలలో చెట్ల కొమ్మలను తొలగించడానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు.

**షాపూర్ సెక్షన్ పరిధిలో...**


షాపూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని కుటీరం విద్యుత్ ఫీడర్, పార్కింగ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు చెట్ల కొమ్మలను తొలగించడానికి స్వర్ణ భారత్ ట్రస్ట్ జిమ్స్ హాస్పిటల్ జె బి ఎం గార్డెన్ ముచ్చింతల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈ విషయాన్ని వినియోగదారులు గమనించారని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు.

**నేడు హిమాయత్ సాగర్, నార్సింగి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత...**

ఇబ్రహీం బాగ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సాయిరాం నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించడానికి శుక్రవారం ఉదయం 11 గంటల నుండి 12:30 వరకు సాయిరాం నగర్ కాలనీ సాయి హర్ష కాలనీ ప్రగతి హెూమ్స్ విజేత సూపర్ మార్కెట్ స్నేహిత విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంట నుండి రెండున్నర గంటల వరకు స్నేహిత కాలనీ, కేకే నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం మూడున్నర నుండి సాయంత్రం 5 గంటల వరకు కేకే వన్ కేకే టు ఫీల్ గుడ్ హెూమ్ గంధంగూడ సాయి బాలాజీ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ పి శ్రీనివాస్ తెలిపారు.

**నార్సింగి విద్యుత్ సెక్షన్ పరిధిలో..**

కోకాపేట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కోకాపేట్ గ్రామం



ఇందిరమ్మ కాలనీ ఎడెన్ విలాస్ పౌలోమి ఆస్ట్రియా ఫినిక్స్ గ్లోబల్ స్కూల్ 60 ఇయర్స్ శివాలయం ప్రాంతం నార్త్ స్టార్ విల్లాస్ గ్రామపంచాయతీ ఆఫీస్, కృష్ణ గోశాల విద్యుత్ ఫీడర్, మై హెూమ్ తరక్ష విద్యుత్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి రెండు గంటల వరకు కృష్ణ గో సేవ ఎన్సిసి అర్బన్ 7 హిల్స్ రోడ్ అలేఖ్య హెూమ్స్ ఓ ఆర్ ఆర్ సర్వీస్ రోడ్, రామ్ కి వన్ ప్రాంతాలు, అక్షయపాత్ర విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్న మూడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు కోకాపేట్ స్కూల్ ,పైప్లైన్ రోడ్, అక్షయపాత్ర ఫౌండేషన్, ఓజీఎం రోడ్ ,వెరిటేక్స్ ,పనాచే ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నార్సింగి సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సందీప్ రెడ్డి తెలిపారు .విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## పేదలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 23(నమస్తే ఉదయం):**
జిల్లా కేంద్రంలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్యం సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, గురువారం జిల్లా ఆసుపత్రిని సందర్శించి ఇన్చార్జి సూపరింటెండెంట్ నవీన్ క్రాంతి తో మాట్లాడి రోగులను కలిసి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా ఆసుపత్రిలో రోగులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు లేవని అన్నారు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, కొందరు సిబ్బంది నిర్లక్ష్యం బాధ్యతరాహిత్యం వల్ల రోగులకు ప్రభుత్వ ఆసుపత్రి పై నమ్మకం పోతుందని అన్నారు ఆసుపత్రిలోని స్కానింగ్ మిషన్లు,ఫ్యాన్లు, జనరేటర్ మెయింటెనెన్స్ సరిగా లేకపోవడం వల్ల తరచుగా రిపేర్లకు వస్తున్నాయని దీని వల్ల రోగులు బయటకు వెళ్లి సొంత డబ్బులతో స్కానింగ్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఒకవేళ స్కానింగ్ ఇక్కడే చేసినా రిపోర్టులు సమయానికి ఇవ్వడం లేదని రోగులు తెలిపినట్లు చెప్పారు. కావలసిన మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవని, త్రాగడానికి మంచినీళ్ళని సైతం బయట కొనుక్కోవలసిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందన్నారు. సెక్యూరిటీ నుండి వైద్యుని వరకు రోగులను, పేషంట్ల వెంట వచ్చిన వారిని చీదరించు కోవడమే కనిపిస్తుందని రోగుల పట్ల వైద్యులు సిబ్బంది వ్యవహరించే తీరు సరిగా లేదని సిబ్బంది వ్యవహరించే తీరు వల్ల ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజల్లో నమ్మకం పోతుందని అన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం అత్యంత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. చిన్న పిల్లల తల్లుల వార్డులో వాష్ రూమ్ లీకేజీ కారణంగా మూసివేశారని, జనరల్ ఫిమేల్ వార్డులో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులకు చికిత్స అందిస్తున్నారని కొందరి రోగులను ఆరు బయటనే ఉంచారని బెడ్ ల కొరత తీవ్రంగా ఉందని అన్నారు, 2022 సంవత్సరం నుండి ఇప్పటివరకు 76 లక్షల కరెంట్ బిల్లులు బకాయిలో ఉండటం ఆశ్చర్యకరమని అన్నారు, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఐజకు చెందిన అరుణ అనే బాలింత, ఏప్రిల్ 19వ తేదీన సిజేరియన్ చేయించుకున్నదని వారం రోజుల తర్వాత ఇంటికి వెళ్లారని ఇన్ఫెక్షన్ అయినట్టుగా గమనించి మళ్లీ వెంటనే ఆసుపత్రికి వచ్చారని రెండు రోజులు ట్రీట్మెంట్ చేసి ఏమీ కాదు అని చెప్పి మళ్ళీ పంపించారని ఇంటికి వెళ్లిన తర్వాత నొప్పి తీవ్రం కావడంతో మళ్లీ ఆస్పత్రికి వచ్చారని ఆపరేషన్ అయిన బాలింతను ట్రీట్మెంట్ సరిగ్గా ఇవ్వకపోవడం వల్ల ఇన్ఫెక్షన్స్ అయిందని మూడవసారి ఆస్పత్రికి వచ్చినా డాక్టర్లు సరిగ్గా పట్టించుకోవడంలేదని పేషెంట్ తరపు బంధువులు తెలిపినట్లు చెప్పారు. దీన్నిబట్టి రోగుల పట్ల డాక్టర్లు వ్యవహరిస్తున్న తీరు ఏ విధంగా ఉందో అర్థం అవుతుందని అలాంటి డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిషనర్ పరిశీలించి వెళ్ళిన తర్వాత కూడా ఆసుపత్రిలో సిబ్బంది తీరు మారకపోవడం శోచనీయమని ఆసుపత్రిపై ఇన్ని రకాల ఆరోపణలు వస్తున్న క్రమంలో సూపరిండెంట్‌గా ఉన్న డాక్టర్ కిషోర్ కుమార్ నెలరోజుల పాటు సెలవులో వెళ్ళటంలో ఉన్న అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఆసుపత్రికి రోజు 400 మంది పేషెంట్లు వస్తుండగా సోమవారం లాంటి ప్రత్యేక రోజుల్లో 800 వరకు రోగులు వస్తున్నారని తెలిపారు.

ఆసుపత్రిలో సరిపడినంత మంది డాక్టర్లు,వైద్య సిబ్బంది లేకపోవడం వల్ల ఉన్న వారిపైనే పని ఒత్తిడి పెరుగుతోందని అన్ని రకాల వైద్యాలకు సరిపడినంత డాక్టర్లు లేకపోవడం వల్ల కాంట్రాక్టు సిబ్బందితోనే వైద్యం చేయిస్తున్నారని తెలిపారు. జనరల్ మెడిసిన్లో ఒక్క రెగ్యులర్ వైద్యుడు లేరని, జనరల్ సర్జన్, సివిల్ అసిస్టెంట్ జనరల్ మూడు పోస్టులు, అనస్తీసియాలో ఇద్దరు ఈ ఎన్ టి, ఆర్థోపెడిక్ లో ఒక్కరు రెగ్యులర్ వాళ్ళు లేరని ఆప్తమాలజిస్టు లో ఒకరు సైక్రియాటిస్టు రెండు పల్మనాలజిస్టు, డెంటల్,రేడియాలజీ డెర్మటాలజీలో ఒక్కరు లేరని హెడ్ నర్స్ లో ఏడు పోస్టులు స్టాఫ్ నర్స్ లో 43 పోస్టులు మిడ్ వైఫ్ లో రెండు ఏఎన్ఎంలో 8 ల్యాబ్ టెక్నీషియన్ ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. ఆసుపత్రిలోని 145 బెడ్స్ గానూ కేవలం 35 మంది మాత్రమే శానిటేషన్ సిబ్బంది పనిచేస్తున్నారని అన్నారు ఆసుపత్రిలో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని వడ్డించే భోజనం క్వాలిటీ, క్వాంటిటీ రెండు తక్కువగా ఉన్నాయని అన్నారు, దీనివల్ల ఆసుపత్రిలోని రోగులు నిత్యాన్నదాన సత్రానికి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు సిబ్బంది నియామకంలో కూడా కోట్లాది రూపాయలు చేతులు మారినట్టు ఆరోపణలు వస్తున్నాయని ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా,స్క్రీనింగ్ కమిటీ లేకుండా నియామకాలు చేశారని విమర్శించారు. జిల్లా వైద్యాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అక్రమ పద్ధతిలో నియామకాలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు. జిల్లాలో ప్రజా వైద్యంలో ఏకైక దిక్కుగా ఉన్న జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిపై జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, ఆసుపత్రి సూపరిండెంట్ పై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని ఆసుపత్రికి కావలసిన వైద్య సిబ్బందిని డాక్టర్లను కావలసిన సౌకర్యాలను మెరుగుపరిచే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ఆస్పత్రిలో ఉన్న రోగులతో పాటు వారి వెంట ఉన్న సహాయకులకు కూడా భోజనం అందించాల్సిన కాంట్రాక్టర్ కేవలం రోగికి మాత్రమే అది కూడా నాణ్యతలేని భోజనం అందిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి నరసింహ, ఉప్పేర్ నరసింహ, నాయకులు రంగన్న, కళ్యాణ్ రాముడు, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.


హాస్పిటల్‌లో రోగులను వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

## టిఎస్‌పిఎస్సి గ్రూప్-1 సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్**

**జిల్లాలో 14 సెంటర్లలో 5,231 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 23 (నమస్తే ఉదయం):**
రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టిఎస్ పిఎస్ సి గ్రూప్-1 ప్రిలిమినరి పరీక్షను అత్యంత పకడ్బందీగా, పార దర్శకంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న టీఎస్పీఎస్సీ గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షను ఎంతో జాగ్రత్తగా, పారదర్శకంగా, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పగడ్బందీగా నిర్వహించాలన్నారు. జూన్ 9వ తేదీన ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించనున్న టీఎస్పీఎస్సీ గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లా నుండి 5231 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, వారికోసం 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ఉదయం 9:00 గంటల నుండి అభ్యర్థులకు పరీక్ష




కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని, 10:00 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలో ఎట్టి పరిస్థితిలో అనుమతించడం జరగదని తెలిపారు. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డు తో పాటు ఆధార్, ఓటర్ ఐడి, పాన్ కార్డ్ లాంటి గుర్తింపు కార్డు, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్ను తెచ్చుకోవాలని ప్రకటనలో కోరారు.

పరీక్ష పకడ్బందీగా నిర్వహణ కోసం నలుగురు రూట్ ఆఫీసర్లను, నలుగురు ఫ్లయింగ్ స్కాడ్ బృందాలతో పాటు 51 మంది ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు, 14 మంది డిపార్ట్మెంట్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేపట్టడం జరుగుతుందన్నారు. మరుగుదొడ్లు, త్రాగు నీరు ఫాన్స్, లైట్స్, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్, బ్లూటూత్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని, డిపార్ట్మెంటల్ అధికారులు పరీక్ష రోజున ఉదయం

8.00 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకుంటారని, పరీక్ష పూర్తయ్యే వరకు కేంద్రం నుండి ఎవరు కూడా బయటకు వెళ్లడానికి వీలు లేదన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చూసుకోవాలన్నారు.

పరీక్షా కేంద్రంలోకి గుర్తింపు కార్డు లేకుండా ఎవరిని కూడా అనుమతించబడదని జిల్లా కలెక్టర్ బి ఎస్ సంతోష్ తెలిపారు.

నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక






# వీవ్ ఆఫ్ కల్చర్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

14వ దాదా సాహెబ్ ఫాల్కే ఫిలిం ఫెస్టివల్ వేడుకలో ఎదుగుతున్న ఫిలిం మేకర్స్ మేధా శక్తికి వేదికగా మారింది. వీవీ ఆఫ్ కల్చర్ షార్ట్ ఫిలిం ఉత్తమ స్టూడెంట్ షార్ట్ ఫిలింగా అవార్డు గెలుచుకుంది. దాదాసాహెబ్ ఫాల్కే ఫిలిం ఫెస్టివల్ వేడుక ఇండియాలోనే అత్యంత గుర్తింపు పొందిన సినిమా వేడుక. వీవీ ఆఫ్ కల్చర్ చిత్రాన్ని సంతోష్ రామ్ మావూరి దర్శకత్వంలో తెరకెక్కింది. ఆయన నెల్లూరుకు చెందిన వ్యక్తి. లాస్ ఏంజిల్స్‌లో సంతోష్ ఫిలిం మేకింగ్‌లో మాస్టర్స్ చేశారు. ఈ చిత్రంలో చేనేత కార్మికుల వస్త్రాలని, వారి ప్రతిభని క్షుణ్ణంగా చూపించారు. స్పష్ట మైన కథాంశం మరియు అద్భుతమైన సినిమాటోగ్రఫీ ద్వారా ఈ చిత్రంలో చేనేత కార్మికుల సంప్రదాయాలని కూడా చూపించారు. ఈ చిత్ర కథాంశం విషయానికి వస్తే... చేనేత వస్త్రాల తయారీలో ఒక కుటుంభం పేరు ప్రఖ్యాతలు సంపాదిస్తుంది. కుటుంభ పెద్ద ఆకస్మికంగా మరనించడం, చేనేత చీరలకు ప్రోత్సహం లభించకపోవడంతో ఆయన భార్య కుటుంభ పోషణ కోసం హ్యాండ్ లూమ్ ఫ్యాక్టరీలో అతితక్కువ వేతనానికి పని చేరుతుంది. ఇంజనీరింగ్ చదువుకుంటున్న తన కుమారుడు విజయ్ ను ఉన్నత చదువుల కోసం అమెరికా పంపాలి అనుకుంటుంది, అందుకు కావాల్సిన డబ్బు కోసం తన ఇంటిని తాకట్టు పెట్టుకొని నగదు ఇవ్వమని ఫ్యాక్టరీ ఓనర్ ను కోరుతుంది., తరువాత ఏం జరిగింది అనేది చాలా ఆసక్తికరంగా ఉంటుందని దర్శక నిర్మాతలు తెలిపారు.

# మే 29న పుష్ప -2 రెండో లిరికల్ సాంగ్


ఇటీవలే పుష్ప పుష్ప పుష్ప రాజ్ అంటూ తొలి లిరికల్ సాంగ్‌తో ప్రపంచవ్యాప్త శ్రోతలను అలరించి.. యూట్యూబ్ వ్యూస్‌లో ఆల్ టైమ్ రికార్డులు నెలకొల్పిన పుష్ప-2 ది రూల్‌లోని పుష్పరాజ్ టైటిల్ సాంగ్ ఇంకా అంతటా మారుమోగుతూనే వుంది.. ఇప్పుడు తాజాగా మరో లిరికల్



అప్‌డేట్‌ను ఇచ్చారు పుష్ప-2 మేకర్స్.. ఈ సారి చిత్రంలోని హీరోయిన్ శ్రీవల్లి వంతు వచ్చింది. పుష్పరాజ్ జోడి అయిన శ్రీవల్లి పుష్పరాజ్‌తో కలిసి పాడుకున్న మెలోడి సాంగ్‌ను కపుల్ సాంగ్‌గా నెల 29న ఉదయం 11:07 నిమిషాలకు విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రోమోను నేడు విడుదల చేశారు మేకర్స్. ప్రోమోలో కేశవ వాయిస్‌తో సెకండ్ సాంగ్ గురించి రష్మికను అడుగుతాడు.


మేకప్ వేసుకునేందుకు సిద్దంగా వున్న శ్రీవల్లి సూసేకి అగ్గిరవ్వ మాదిరి వుంటాదే నా సామీలివుంటాడే నా సామి అంటూ ఆమె పాడుతూ ఐకానిక్ స్టెప్పుతో అలరించింది.

ఈ ప్రోమో చూసి సాంగ్ అదిరిపోయే మెలోడిలా వుండబోతుందని అందరూ అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న చిత్రం పుష్ప-2 ది రూల్. పుష్ప ది రైజ్‌తో ప్రపంచ సినీ ప్రేమికులను అమితంగా ఆకట్టుకోవడమే ఇందుకు కారణం. ఈ చిత్రంలో ఐకాన్‌స్టార్ నటనకు, బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వ ప్రతిభకు అందరూ ఫిదా అయిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఇద్దరి సన్సేషనల్ కలయికలో రాబోతున్న పుష్ప-2 ది రూల్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆకాశమే హద్దుగా అంచనాలు వున్నాయి. ఈ సంవత్సరం ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గా విడుదల చేయనున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక పుష్ప ది రైజ్ చిత్రంలో తన నటనతో మొట్ట మొదటిసారిగా తెలుగు కథానాయకుడు జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు తీసుకోవడం, మొట్ట మొదటిసారిగా దక్షిణ భారతదేశ నటుడు దుబాయ్‌లో మ్యాడమ్ టుసార్ట్‌లో స్టాట్యూ కలగటమే కాకుండా మెదటి తెలుగు నటుడుగా గ్యాలరీని ఏర్పాటు చేయటం తెలుగు వారందరికి గర్వకారణం.



# "కల్కి 2898 ఎడి" నుండి బుజ్జి, ది స్వాంకీ వెహికల్ రోబోట్ లాంచ్

రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన ప్రతిష్టాత్మక గ్లోబల్ ప్రాజెక్ట్ కల్కి 2898 ఎడి నిర్మాతలు కస్టమ్-మేడ్ వాహనాన్ని విడుదల చేయడానికి హైదరాబాద్ లో ఒక వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు మరియు బుజ్జిని ప్రపంచానికి పరిచయం చేయడానికి దాదాపు 1 నిమిషం నిడివి గల టీజర్ ను కూడా విడుదల చేశారు. హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో జరిగిన ఈ వేడుకకు పెద్ద ఎత్తున జనాలు హాజరయ్యారు. రెగ్యులర్ ఫిల్మ్ ఈవెంట్ ల మాదిరిగా కాకుండా, ఈ ఈవెంట్ లో బైకర్లు కొన్ని అద్భుతమైన విన్యాసాలు చేశారు. అమెరికాస్ గాట్ టాలెంట్ సీజన్ 2ను గెలుచుకున్న ముంబైకి చెందిన వి.అన్‌బీటబుల్ జట్టు వేదికపై ప్రభాస్ మెడ్లీపై ప్రదర్శన ఇచ్చింది, ఇది ప్రధాన హైలైట్ లలో ఒకటి. కస్టమ్ మేడ్ వెహికల్ బుజ్జి బిల్డింగ్ వెనుక ఉన్న టీమ్ ని నాగ్ అశ్విన్ పరిచయం చేశాడు. "బుజ్జి పేరు చిన్నగా అనిపించినా అది మాకు చాలా ప్రత్యేకమైనది. కల్కి 2898 ఎడి తీయడం చాలా కష్టమైన చిత్రం. నేను ఇంజనీరింగ్ చేయలేదు. నేను సహాయం కోసం ఆనంద్ మహీంద్రాకు ట్వీట్ చేసాను. అతను తన బృందాన్ని యాక్టివేట్ చేశాడు. వారు మమ్మల్ని కోయంబత్తూర్ లోని జయం మోటార్స్ కు తీసుకువెళ్లారు. ఇది చాలా ప్రయోగాత్మక రేసింగ్ కార్-బిల్డింగ్ కంపెనీ. ఇలాంటి ఫీచర్లతో కూడిన కారును తయారు చేసేందుకు భారీ పరిశోధన అవసరం. ఇది మేము ఇక్కడ తీసివేసిన విషయం. కారు భారీగా ఉంది. మేము దానిని కల్కి మరియు భైరవ కోసం అంచెలంచెలుగా అనుకూలీకరిం చాము మరియు నిర్మించాము. మహీంద్రా టీమ్ మొత్తానికి, జయం మోటార్స్ టీమ్ మరియు కల్కి టీమ్ కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు. ప్రభాస్ మాట్లాడుతూ "నా దర్శకుడు నాగ్ అశ్విన్ నన్ను 3 సంవత్సరాలు టార్చర్ పెట్టాడు. ఈ కార్యక్రమానికి క్యాజువల్ గా రావాలనుకున్నాను. కానీ నాగ్ అశ్విన్ నన్ను ఈ విన్యాసాలు చేసేలా చేశాడు. క్యూరియాసిటీని పెంచడానికి 'ఎవరో స్పెషల్' అనే ట్వీట్ ను పోస్ట్ చేయాలనేది నా దర్శకుడి ఆలోచన. ఇది పబ్లిసిటీలో భాగమైంది. బుజ్జి చాలా ప్రత్యేకం. మీరు నన్ను ఎన్నుకోమని అడిగితే, నేను దాని మెదడు కంటే ,బుజ్జి శరీరాన్ని ఎంచుకుంటాను. మీ అందరిలాగే నేను కూడా సినిమా చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. బుజ్జి టీజర్ మీకు నచ్చిందని ఆశిస్తున్నాను.





# 'లవ్ మీ' ఓ డిఫరెంట్ మూవీ - నిర్మాత దిల్ రాజు

ఆశిష్, వైష్ణవి చైతన్య హీరో హీరోయిన్లుగా శిరీష్ సమర్పణలో దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ మీద హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన చిత్రం 'లవ్ మీ'. ఈ చిత్రానికి అరుణ్ భీమవరపు దర్శకత్వాన్ని వహించారు. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. . ఈ హారర్ థ్రిల్లర్‌ను ప్రపంచ వ్యాప్తంగా మే 25న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ కార్యక్రమంలో...ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ మాట్లాడుతూ "ఆశిష్ హండ్రెడ్ పర్సెంట్ ప్రామిసింగ్ పర్సనాలిటీ. ఇలాంటి యంగ్ హీరో ఈ బ్యానర్‌లో వర్క్ చేస్తే మంచి ఫలితం రావటం తథ్యం. ఇది తనకు బిగినింగ్ మాత్రమే. డైరెక్టర్ అరుణ్‌ని కలిశాను. కొత్త వాళ్లతో సినిమా చేసే ధైర్యం దిల్ రాజు అండ్ కో మాత్రమే సాధ్యం. యంగ్ టీమ్‌కి కీరవాణిగారు, పి.సి.శ్రీరామ్ వంటి స్టార్ టెక్నీషియన్స్‌తో పని చేసే అవకాశం రావటం వారికి దక్కిన అదృష్టం.బేబీలో ఓ ఊపు ఊపేసిన వైష్ణవి చైతన్య లవ్‌మీలో చక్కగా నటించిందని ట్రైలర్ చూస్తుంటే అర్థమైంది. ఆల్ ది బెస్ట్ టు లవ్ మీ టీమ్" అన్నారు. డైరెక్టర్ రవికిరణ్ కోలా మాట్లాడుతూ "లవ్ మీ' అనౌన్స్‌మెంట్ రోజు నుంచే అందరిలో ఆసక్తి నెలకొంది. కీరవాణి, పి.సి.శ్రీరామ్ వంటి లెజెండ్స్ తోపాటు దిల్ రాజుగారి వంటి బలం కొత్త దర్శకుడైన అరుణ్ వెనుక నిలబడింది.

# 'రాజు యాదవ్' ఫన్ అండ్ ఎమోషనల్ రైడ్

## - హీరో గెటప్ శ్రీను



బుల్లి తెర కమల్ హాసన్‌గా పాపులరైన జబర్దస్త్ ఫేమ్ గెటప్ శ్రీను హోల్సమ్ ఎంటర్ టైనర్ 'రాజు యాదవ్' తో హీరోగా ఆరంగేట్రం చేస్తున్నారు. ఈ చిత్రం ద్వారా కృష్ణమాచారి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. సాయి వరుణవి క్రియేషన్స్, చరిష్మా డ్రీమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లపై కె. ప్రశాంత్ రెడ్డి, రాజేష్ కల్లెపల్లి సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, ట్రైలర్, పాటలకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ ఏపీ, తెలంగాణలో గ్రాండ్ గా విడుదల చేయబోతున్నారు. మే 24న రాజు యాదవ్ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో హీరో గెటప్ శ్రీను విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలని పంచుకున్నారు. హీరోగా చేయాలని ప్లాన్ చేసుకోలేదు. ఇప్పటివరకూ నటనకు ఎక్కువ స్కోప్ వున్న పాత్రలని చేయడానికి ప్రయత్నించాను. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా, కమెడియన్ గానే స్థిరపడాలని అనుకున్నాను. రాజు యాదవ్ కథ విన్నాక ఫుల్ లెంత్ పెర్ఫార్మెన్స్ చేసే అవకాశం కలుగుతుందనిపించింది. అందుకే ఈ సినిమా చేశాను. నా వరకూ ఇది నేను చేస్తున్న ఫుల్ లెంత్ క్యారెక్టర్ గానే భావిస్తాను. చాలా కష్టంతో కూడుకున్న పాత్రిది. ఈ పాత్ర చేస్తున్నప్పుడు ఒకానొక దశలో ఆర్టిస్ట్ గా ఫెయిల్ అయిపోయానేమో అనుకునే సందర్భాలు కూడా వున్నాయి. ఒక సీన్ చేస్తునపుడు చాలా కష్టంగా సవాల్ గా అనిపించింది. అయితే దర్శకుడు చాలా స్ఫూర్తిని ఇచ్చి ఈ పాత్ర చేయించారు. ముందు నా పాత్ర గురించి చెప్పారు. భలే అనిపించింది. తర్వాత కథ పూర్తిగా చదివాను. చాలా నచ్చింది. చాలా రియలెస్టిక్ గా వుండే సినిమా ఇది. విజువల్స్, సన్నివేశాలు, డైలాగ్స్ ఇవన్నీ సహజత్వంతో నిండివుంటాయి. ప్రస్తుతం ఆడియన్స్ కంటెంట్ వున్న రియలెస్టిక్ సినిమాలని అదరిస్తున్నారు. ఈ సినిమా కూడా తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం వుంది. రాజు యాదవ్ ఫన్ అండ్ ఎమోషన్ రైడ్. తల్లితండ్రులు తమ కొడుకు నుంచి ఏం కోరుకుంటున్నారు ? అలాగే కొడుకు కోణంలో తల్లితండ్రులు ఎలా వుండాలి? తల్లితండ్రుల కలని సాకారం చేయడానికి ఎన్ని అడ్డంకులు వచ్చినా వెనకడుగు వేయకూడదనే అంశం ఈ కథకు మూలం. కృష్ణమాచారి గారు నీది నాది ఒకే కథ, విరాట పర్వం, అలాగే ఒక స్పానిస్ సినిమాకి సహాయ దర్శకుడిగా పని చేశారు. ఆయన కథ చెప్పే విధానం చాలా నచ్చింది. చాలా సహజత్వంతో సినిమాని తీశారు. ఫన్‌తో పాటు ఎమోషన్ ని చాలా అద్భుతంగా చూపించారు.

# "యక్షిణి"లో జ్వాలగా...



ఆర్కా మీడియా వర్క్స్, డిస్నీ ప్లస్ హాట్ స్టార్ కాంబినేషన్ లో వస్తున్న మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ "యక్షిణి". ఈ వెబ్ సిరీస్ ను శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మిస్తున్నారు. వేదిక, మంచు లక్ష్మి, రాహుల్ విజయ్, అజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. దర్శకుడు తేజ మార్ని "యక్షిణి" సిరీస్ ను రూపొందిస్తున్నారు.

మిస్టీరియస్ జ్వాల అంటూ స్పెషల్ పోస్టర్ ద్వారా "యక్షిణి" వెబ్ సిరీస్ నుంచి మంచు లక్ష్మి నటించిన జ్వాల క్యారెక్టర్ ను ఇంట్రడ్యూస్ చేశారు. ఫాంటసీ, రొమాన్స్, కామెడీ అంశాలతో రూపొందిన "యక్షిణి" ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. డైరెక్టర్ తేజ మార్ని విజన్ కు తగినట్లు భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో ఆర్కా మీడియా వర్క్స్ ఈ సిరీస్ ను నిర్మించింది. జూన్ లో తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీలో "యక్షిణి" వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కు రాబోతోంది.

**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist,